
పర్యాటకం.. అభివృద్ధికి దూరం

- జల్లేరు జలాశయం చుట్టూ ప్రశాంతమైన వాతావరణం
- కనువిందు గొలిపే ప్రకృతి అందాలు
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలని వినతి


గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం


ఆహ్లాదకరంగా ఉన్న పంట కాల్వ


జల్లేరు జలాశయంపై టూరిజం శాఖ నిర్మించిన గెస్ట్ హౌస్

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతానికి వచ్చిన పర్యాటకులకు రమణీయమైన ప్రదేశాల్లో గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం ఒకటి. జలాశయం చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం, చల్లటి గాలి, కనువిందు గొలిపే అందాలు పర్యాటకుల మనసులను దోచుకుంటున్నాయి. రెండు కొండల మధ్య 2 కిలోమీటర్ల మేర ఈ జలాశయం ఉంది. జలాశయం గట్టు నుంచి చూస్తే ఎత్తయిన కొండలు, పచ్చని చెట్లతో ప్రకృతి ఎంతో అందంగా కనిపిస్తూ ఉంటుంది. ఉదయం తూర్పు కొండల్లో సూర్యోదయం రమణీయంగా ఉంటుంది. ఈ జలాశయంలో రకరకాల పక్షులు కూడా వచ్చి సేదతీరుతుంటాయి. గుబ్బల మంగమ్మగుడికి దర్శనానికి వచ్చిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జలాశయం అందాలను చూసి కనువిందు పొందుతున్నారు.

అభివృద్ధి చేస్తే..

1974లో ఈ జల్లేరు జలాశయంను నిర్మించారు. అయితే ప్రస్తుతం గట్టు పచ్చిమొక్కలతో అందహీనంగా మారింది. కనీసం జంగిల్ క్లియరెన్స్ కూడా చేయని పరిస్థితి నెలకొంది. సుమారు 4,200 ఎకరాల ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించేందుకు ఈ జలాశయాన్ని నిర్మించారు. సుమారు 326 ఎకరాల విస్తీర్ణంలో జల్లేరు జలాశయం విస్తరించి ఉంది. అయితే ఆయకట్టు రైతులకు నీరు అందుతున్న ఈ జలాశయం మరమ్మతులు చేపడితే పర్యాటకంగా కూడా ఎంతో అబివృద్ధి చెందుతుందని పలువురు చెబుతున్నారు. ఇక్కడ జలాశయం కింద అశోక్ చెట్లు ఎంతో ఆహ్లాదంగా ఉంటాయి. జలాశయంలో చిన్నపిల్లల కోసం చిన్నబోట్లు కూడా ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పర్యాటకులు కోరుతున్నారు. ఇటీవల జలాశయం వద్ద ఉన్న కొండపై ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌ను ఐటీడీఏ ద్వారా టూరిజం శాఖ వారు నిర్మించారు. అలాగే గట్టును కూడా మరమ్మతు చేయించి రంగులు వేసి ఆహ్లాదకరంగా ఏర్పాటు చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

జలాశయం అభివృద్ధికి కృషి చేస్తున్నాం



జల్లేరు జలాశయం అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ప్రస్తుతం రూ. 8 లక్షల 42 వేలతో గేట్ల మరమ్మతు పనులు చేస్తున్నాం. అలాగే మరో రూ.45 లక్షలతో గట్టుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్‌కు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పనులు చేపట్టేలా కృషి చేస్తాం.

– టి. సురేష్, ఎంఐ ఏఈఈ, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



జల్లేరు జలాశయం సుమారు 326 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. చుట్టూ కొండలు, పచ్చని చెట్లు, ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటుంది. రెండు కొండల నడుమ గట్టు పర్యాటకుల మనసును దోచుకుంటుంది. ఇక్కడ కాటేజీలు, పర్యాటకుల కోసం జలాశయాల్లో బోట్లు ఏర్పాటు చేస్తే అటు ఆదాయం కూడా వస్తుంది. ఆ దిశగా అధికారులు కృషి చేయాలి.

– తెల్లం రాముడు, సర్పంచ్, దొరమామిడి, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

మానవత ఆర్థిక సహాయం


అంకాలగూడెంలో ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

కొయ్యలగూడెం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న అంకాలగూడెంకు చెందిన జుమాల రేఖ అనే మహిళకు శనివారం మానవత స్వచ్ఛంద సంస్థ రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మాటూరు సుధీర్ మాట్లాడుతూ బాధితురాలు డయాలసిస్ చేయించుకునే పరిస్థితికి ఉండడంతో ఆమెను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని, అదేవిధంగా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో 'పొలం పిలుస్తోంది'


మొక్కజొన్న తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

లింగపాలెం: వ్యవసాయ శాఖ సూచనలు అనుసరిస్తూ రైతులు సాగు నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా కోరారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొక్కజొన్న విత్తనోత్పత్తి చేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందించారు. ప్రతి రైతు ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు. నాటు పొగాకు, బార్లీ పొగాకు సాగును ప్రజారోగ్య రీత్యా తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ శారద

ద్వారకాతిరుమల: మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద (ఏలూరు) మండలంలోని ద్వారకానగర్, ఎం.నాగులపల్లి–2 అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ కార్యక్రమాలు, పోషణవాటిక, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ లను పరిశీలించారు. ప్రీస్కూల్ నెలవారీ సిలబస్ పరిశీలించి, పిల్లలను పలు ప్రశ్నలు అడిగి, వారు చెప్పిన సమాధానాలకు అభినందించారు. అలాగే పిల్లల హాజరును స్వయంగా తనిఖీ చేశారు. రికార్డ్ వర్క్, పిల్లల జాగ్రత్తలకు సంబంధించిన అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు ఆమె పలు సూచనలు, సలహాలనిచ్చారు.

పట్టిసంలో గోవిందునికి ప్రత్యేక పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పోలవరం రూరల్: పట్టిసం గ్రామంలోని భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, తులసీదళార్చన పూజలు జరిపారు. సామూహిక విష్ణు సహస్ర నామపారాయణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ నిర్వాహకులు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

పరామర్శ


జయరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కంభం విజయరాజు

కామవరపుకోట: అనారోగ్యంతో మృతి చెందిన కొండగూడెంకు చెందిన కామా జయరాజు కుటుంబ సభ్యులను శనివారం వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అన్ని విధాల అండగా ఉంటామని జయరాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మెరుగు బాబురావు, బండెల ప్రభాకర్, మానుకొండ దేవరాజు, నల్లమిల్లి ప్రసాద్, మానుకొండ దేవస్తుతుడు, సాల్మన్, సతీష్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

కొయ్యలగూడెం: సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. శనివారం దిప్పకాయలపాడులో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సభల్లో జనసేన పార్టీ నాయకుడు పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారని, తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచినా ఇప్పటివరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకులు శుక్లబోయిన రాంబాబు, మారిన పేర్రాజు, అడపా నాగర్జున, మారిశెట్టి అప్పారావు, షేక్ బాబ్జి, సోలా ప్రసాద్, వేగువాడ నాగేశ్వరరావు సామేలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలు


యర్రంపేట సమీపంలో గ్రావెల్ తవ్వకాలు నిర్వహించిన దృశ్యం

కొయ్యలగూడెం: గ్రావెల్ తవ్వకాలకు యర్రంపేట, కుంతలగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని రెవెన్యూ భూములు అక్రమార్కులకు అడ్డాగా నిలిచాయి. శనివారం యర్రంపేట, సుభద్రపాలెం గ్రామాల మధ్య(పుంత రోడ్డు) ఉన్న మెట్ట ప్రాంతం నుంచి గ్రావెల్ తవ్వకాలు కొనసాగాయి. దాదాపు వారం రోజుల నుంచి గ్రావెల్ తవ్వకాలు కొనసాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై రెవెన్యూ శాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. టిప్పర్లను ఏర్పాటు చేసి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు కొనసాగిస్తున్నా ఇందుకు సంబంధించిన అధికారులు నోరు మెదపకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అరసవెల్లికి శ్రీవారి ధర్మప్రచార రథం


ధర్మప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు, తదితరులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ధర్మ ప్రచార రథం శనివారం శ్రీకాకుళం జిల్లా అరసవెల్లికి పయనమయ్యింది. ఈనెల 4న రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని అరసవెల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయం వద్ద రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల ధర్మప్రచార రథాలను భక్తుల సందర్శనార్థం ఉంచాలని దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు చినవెంకన్న ధర్మప్రచార రథం ఆలయ జంటగోపురాల ప్రాంతం నుంచి బయల్దేరి వెళ్లింది. అయితే ముందుగా ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు కొబ్బరికాయలు కొట్టి రథాన్ని ప్రారంభించారు.

శ్రీవారి స్వర్ణమయ పథకానికి రూ.లక్ష విరాళం


దాత కాళిదాస్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి విమాన గోపుర స్వర్ణమయ పథకానికి ఒక భక్తుడు శనివారం రూ.1,00,001 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన డి.కాళిదాస్ ముందుగా ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈసందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అనంతరం దాత దంపతులకు స్వామివారి ప్రత్యేక దర్శన భాగ్యాన్ని కల్పించారు.

షేక్ నాగూర్ మీరాకు సత్కారం


నాగూర్ దంపతులను సత్కరిస్తున్న రైతు ప్రతినిధులు, బోర్డు అధికారులు

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన షేక్ నాగూర్ మీరాకు శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ బాజీ, ఏఎస్ గ్రేసీ మార్గరెట్, పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది మాట్లాడుతూ నిరక్షరాస్యులైన రైతుల బేరన్ లైసెన్స్ దరఖాస్తు ఫారాలను పూర్తి చేయడం, ఫ్లోర్, గోడౌన్, ఆక్షన్, సమయాలలో కీలకంగా వ్యవహరించి రైతుల మన్ననలు పొందిన వ్యక్తి షేక్ నాగూర్ మీరా అని కొనియాడారు. ఈ సందర్భంగా రైతులు నాగూరు దంపతులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎస్ఎల్ఎస్ పరిధిలలోని ఐదు వేలం కేంద్రాలకు చెందిన రైతులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

4న ఆర్అండ్ఆర్ సమస్యలపై సమావేశం

వేలేరుపాడు: ఆర్అండ్ఆర్ సమస్యలపై ఈ నెల 4వ తేదీన వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్అండ్ఆర్ అధికారుల సమక్షంలో ఆర్అండ్ఆర్‌కు సంబంధించి అన్ని రకాల సమస్యలపై ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కావున వేలేరుపాడు మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తపాలా జీవిత బీమా పొందండి


జీవిత బీమా క్లెయిమ్ చెక్కును నామినీకి అందజేస్తున్న ఏలూరు జిల్లా తపాలా సూపరింటెండెంట్ శ్రీకర్ బాబు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో శనివారం 141వ తపాలా జీవిత బీమా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు జిల్లా తపాలా సూపరిండెంట్ శ్రీకర్ బాబు మాట్లాడుతూ తపాలా జీవిత బీమా నందు తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ పొందవచ్చునని, అదేవిధంగా రూ.50 లక్షల వరకు గరిష్ఠంగా పాలసీ పొందవచ్చునన్నారు. క్లెయిమ్ సెటిల్మెంట్, మెచ్యూరిటీ సెటిల్మెంట్ అన్నీ కూడా స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలోనే ఒక రోజులో చేయించుకోవచ్చని తెలిపారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయ పోస్ట్‌మాస్టర్ మాట్లాడుతూ శనివారం సుమారు 15లక్షల ప్రీమియం సేకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీవితా బీమా క్లెయిమ్ సొమ్ము రూ.5.78 లక్షల చెక్కును నామినీకి అందజేశారు. అదేవిధంగా ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సహాయ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు, ఏలూరు సహాయ సూపరింటెండెంట్ డి.శ్రీనివాసరావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

'లక్ష డప్పులు, వేల గొంతులు'ను జయప్రదం చేయండి


బందంచర్లలో ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వేల గొంతుల సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్క మాదిగ జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్, అనుసంబంధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. టి.నరసాపురం మండలం బందంచర్ల గ్రామంలో ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ సాధించుకోవడానికి ఇదే చివరి పోరాటమని, ప్రతి ఒక్కరూ విశ్వరూప మహాసభ కంటే ఎక్కువగా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి ప్రాతినిధ్యం ఉండాలని, మండలం నుంచి తప్పనిసరిగా రెండు బస్సులు, 50 డప్పులతో కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న మంద కృష్ణ మాదిగకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలవరం, నూజివీడు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జిలు లంకా జయబాబు, దుబ్బాక దేవరాజు, ముదగండ్ల ముక్తేశ్వరరావు, ఏలూరు జిల్లా ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి నాగేంద్ర బాబు, ఎంఎస్‌పీ ప్రచార కార్యదర్శి నందిపాం వెంకటేశ్వరరావు, టి.నరసాపురం మండల ఎంఆర్‌పీఎస్ ప్రచార కార్యదర్శి నందిపాం రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రత లోపిస్తే కార్యదర్శులదే బాధ్యత


కలరాయనగూడెంలో దోమల నివారణ చర్యలు

లింగపాలెం: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని లింగపాలెం మండలం పంచాయతీ విస్తరణాధికారి జేఎం రత్నకుమార్ కోరారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలోని కలరాయనగూడెం, నరసన్నపాలెం గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించిందంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో వెంటనే స్పందించిన ఎంపీడీవో వాణి, పంచాయతీ విస్తరణ అధికారి రత్నకుమార్ గ్రామాల్లో చర్యలు చేపట్టారు. కార్యదర్శులతో మమేకమై తుప్పలను తొలగించి, డ్రెయిన్ పూడికను తీయించి, ఫాగింగ్ చేయించి, బ్లీచింగ్ చల్లించారు. ఈసందర్భంగా ఈవోపీఆర్‌డీ రత్నకుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత లోపిస్తే గ్రామ కార్యదర్శులు బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు కె.స్వరాజ్యలక్ష్మి, వై.కిరణ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

చింతలపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై కుటుంబరావు సిబ్బందితో కలిసి జరిపిన దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రెండు పుంజులు, నాలుగు మోటర్ సైకిళ్లు, రూ.6,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుటుంబరావు చెప్పారు.

'సకాలంలోనే వైద్యం అందించాం'

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం నందాపురం ఆర్అండ్ ఆర్ కాలనీలో గర్భవతి మధుబాల, శిశువు మృతిపై జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆస్పత్రి పర్యవేక్షకులు బీవీ కమల స్పందించారు. ఈ మేరకు శనివారం వివరణ ఇచ్చారు. గర్భవతి మధుబాల జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆస్పత్రికి గురువారం వచ్చారని, ఆమెను అడ్మిట్ చేసుకుని వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేశామని చెప్పారు. ఆ సమయంలో స్కాన్ చేయగా ఆమె గర్భంలో శిశువు ఫీటల్ హార్ట్ మూమెంట్స్ అస్పష్టంగా ఉన్నట్లు తేలిందని అన్నారు. అలాగే రక్త పరీక్షల్లో ప్లేట్‌లెట్స్ కూడా 80 వేలు, హెచ్‌బీ 5 గ్రాములు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఇది హై రిస్క్ కేసు అయినందున మెరుగైన వైద్యం కోసం జీజీహెచ్ ఏలూరు డ్యూటీ గైనకాలజిస్టును ఫోన్‌లో సంప్రదించి కేసు వివరాలను తెలిపినట్లు చెప్పారు. 108 వాహనంలో తరలించామని ఆ సమయంలో అవసరమైన అన్ని ఇంజక్షన్‌లు ఇచ్చి పంపించామని చెప్పారు. తాము ఎటువంటి నిర్లక్ష్యం చూపలేదని తెలిపారు.

నిర్వాసితులపై చులకన భావం తగదు

బుట్టాయగూడెం: రామన్నగూడెం సమీపంలోని ఆర్అండ్ఆర్ నిర్వాసిత కాలనీలో తుమ్మిలేరుకు చెందిన మధుబాల(23) 9 నెలల గర్భవతి, శిశువు వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందితే కనీసం ఏ ఒక్క అధికారి కూడా స్పందించకపోవడం బాధాకరరమని మృతురాలు సోదరుడు వేట్ల ముత్యాలరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే రెండు నిండు ప్రాణాలు కోల్పోతే అధికారులు నిర్వాసిత కాలనీవైపు కన్నెత్తి చూడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని అన్నారు. నిర్వాసితులంటే ఎంత చులకన భావం ఉందో అర్థమవుతుందని అన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పారిజాతగిరిలో విశేష పూజలు


విశేషాలంకరణలో స్వామివారు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థప్రసాదగోష్ఠి, బాల భోగ నివేదన తదితర పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాలకు చెందిన యాత్రికులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోగా వారికి ఈవో మానికల రాంబాబు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. జంగారెడ్డిగూడెంకు చెందిన రొక్కం మణికంఠ, మాలతి దంపతులు ఉచిత అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

వైభవం.. హనుమద్ కళ్యాణం


కన్నాయిగూడెంలో హనుమద్ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ సువర్చలా సమేత హనుమద్ కల్యాణోత్సవాన్ని శనివారం కన్నాయిగూడెంలో వైభవంగా నిర్వహించారు. శ్రీ కార్యసిద్ధి అభయ ఆంజనేయ స్వామి ఆలయ వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించి స్వామివారికి కల్యాణం జరిపించారు. సువర్చలా సమేత హనుమద్ స్వామివార్లకు పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నుంచి నిర్వహించిన అన్నసమారాధనలో పొంగుటూరు పంచాయతీ పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మద్ది క్షేత్రంలో పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు పంచామృత అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన పూర్వభాద్రా నక్షత్రం పురస్కరించుకుని ఆలయ అష్టోత్తర మండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్లను ఆసీనులను చేసి, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు ఏర్పాట్లు పర్యవేక్షించినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు.

తల్లీ కుమార్తెలపై దాడి

జంగారెడ్డిగూడెం: తల్లీ కుమార్తెలపై దాడి చేసిన ఘటన జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన రజియా, మనీషా తల్లీ కుమార్తెలు. రజియా పెద్ద కుమార్తె భానుశ్రీకు, కామవరపుకోట మండలానికి చెందిన పోలిన పురంధరతో వివాహం జరిగింది. ఆస్తి తన పేరున రాయాలంటూ రజియాకు చెందిన ఇంటి కాగితాలు, రికార్డులను పెద్దకుమార్తె, అల్లుడు తీసుకువెళ్లిపోయారని రజియా తెలిపింది. దీనిపై డిసెంబర్ 12న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో శనివారం భానుశ్రీ, పురంధరలతో పాటు మరికొందరు వ్యక్తులు రజియా ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి తన కుమార్తె మనీషాతో పాటు తనపై దాడి చేశారని రజియా తెలిపింది. గాయపడిన రజియా, మనిషా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ప్రకటన

నా క్లయింట్ చింతలపూడి మండలం, యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన శ్రీమతి షేక్ హసీనా [illegible] ... 02.01.2025వ తేదీన నా క్లయింట్ షేక్ హసీనా [illegible] SSC, Intermediate, D.Ed., B.Sc., Provisional Certificates, Marks List & Transfer Certificates [illegible]

ఇట్లు :
గంటా రంజిత్ కుమార్
అడ్వకేట్ & నోటరీ
[illegible] చింతలపూడి
సెల్: [illegible]